క్లుప్తంగా

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం

ఉదయగిరి: కార్తీక మాసం సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం క్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల కోసం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం అరుణాచలం బస్సు సర్వీసును ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 14, 17, 24 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక సర్వీసులకు ఆన్‌లైన్ సౌకర్యం ఉందని, రానుపోను ఒక్కరికి రూ.1,650 చార్జీగా నిర్ణయించినట్లు చెప్పారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా డేవిడ్‌రాజు



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణ సీపీఎం కార్యదర్శిగా కొప్పోలు డేవిడ్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఎం నేత చంద్రా రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశంలో డేవిడ్‌రాజును నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతు సంఘ నాయకులు మూలి వెంగయ్య, సీపీఎం, సీఐటీయూ నాయకులు షేక్ సంధాని, మొలబంటి నాగేంద్ర, ఆత్మకూరు నాగయ్య, హజరత్తయ్య, గుల్జార్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్యపరీక్షలు



సీతారామపురం: స్థానిక ఎల్‌వీఆర్ కళాశాల ప్రాంగణంలో 2002–2004 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ఎనెల్ హాస్పిటల్ వైద్యులు నాగేంద్రప్రసాద్, స్వామాట్ 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎనెల్ హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం

దుత్తలూరు: మండలంలోని తిమ్మాపురంలో ఆదివారం జరిగిన గోపిదేశి కొండస్వామి–సుబ్బరత్తమ్మ కుమారుడు మధుకృష్ణ వివాహానికి ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వరుడ్ని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సర్పంచ్ ఉలవ శ్రీలత, నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, శ్రీహరినాయుడు, తుమ్మల వెంగయ్యచౌదరి, నాగేశ్వరరావు, వెంగళరావు, సుధాకర్, చెన్నకేశవులు, సింగవరపు గంగాధర్, చుండి చైతన్య, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపంలోని మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా మున్నెల్లి గ్రామానికి చెందిన నారాయణ, పోలమ్మ, నాగమణి ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని నారాయణస్వామి ఆలయానికి మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. నారాయణప్పపేట సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహన సిబ్బంది పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: మండలంలోని చెర్లోసంఘం గ్రామానికి చెందిన చిరంశెట్టి సంజీవయ్య(75), బట్రకాగొళ్లు గ్రామానికి చెందిన యద్దల శేఖర్(36) ఆదివారం మరణించారు. వారి అంత్యక్రియలకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి రూ.3 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతిమ యాత్ర వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు.

7న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

పొంచి ఉన్న వరద ముప్పు

తీరంలో విచ్చలవిడిగా రొయ్యల గుంతల ఏర్పాటు

- వరద, పంట కాలువలను ఆక్రమించి నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు
- వరదలొస్తే గ్రామాలు గల్లంతే


తీరంలో సాగుచేస్తున్న రొయ్యల గుంతలు

చిట్రగుంట: బోగోలు మండలంలోని తీరప్రాంతంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న రొయ్యల గుంతలు తీరప్రాంత గ్రామాలకు పెనుముప్పుగా మారుతున్నాయి. వ్యవసాయ భూములతో పాటు వరద నీటిని సాఫీగా సముద్రానికి చేర్చే ఎల్లవ కాలువలు, పంటకాలువలను ఆక్రమించి రొయ్యల గంతలుగా మార్చేస్తుండడం, వాటి చుట్టూ ఎత్తుగా నిర్మిస్తున్న కట్టల కారణంగా తుపాన్లు, వరదల సమయంలో ఊహించని ముప్పు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏటా సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు తీర ప్రాంతానికి తుపాన్ల ముప్పు పొంచి ఉంటుంది. తుపాన్లు తీరాన్ని చిగురుటాకులా వణికిస్తుంటాయి. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతోనూ భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటిని సముద్రంలోకి తీసుకువెళ్లడంలో పిల్లివాగు, ఉబ్బలవాగు, ఎస్కేప్ చానళ్లు కీలకం. ప్రస్తుతం మితిమీరిన రొయ్యల గుంతల సాగు, కాలువల ఆక్రమణల కారణంగా కాలువలు పొంగి తూర్పుతీరప్రాంత గ్రామాలు వరదలో చిక్కుకునే ప్రమాదం పొంచి ఉంది. వరద ఉధృతి తగ్గే వరకూ అల్లిమడుగు, తెల్లగుంట, ఉమామహేశ్వరపురం, తదితర గ్రామాలకు రాకపోకలు కూడా స్తంభించిపోతాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లు, వంతెనలు కూడా ధ్వంసమవడంతో అధికారులు పడవల సాయంతో గ్రామాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఆరేడేళ్ల క్రితం వరకూ ఏటా ఇదే పరిస్థితి నెలకొనేది. గడిచిన ఆరు సంవత్సరాల నుంచి తుపాన్లు, వరదల ముప్పు పెద్దగా లేకపోవడంతో తీవ్రస్థాయిలో ముంపు పరిస్థితి ఎదురవలేదు. రొయ్యల గుంతలు ఎక్కువగా లేని సమయంలోనే ముంపు పరిస్థితిని ఎదుర్కొనేందుకు అధికారులు నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం విపరీతంగా ఏర్పాటు చేస్తున్న రొయ్యల గుంతల కారణంగా పరిస్థితి చేయి దాటిపోయేలా ఉంది.

అనుమతుల్లేకుండానే రొయ్యలసాగు

బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా రొయ్యల గుంతల సాగు చేపడుతున్నారు. గడిచిన రెండేళ్లలోనే సుమారు 800 నుంచి 1000 ఎకరాలకుపైగా కొత్తగా గుంతలు ఏర్పాటు చేశారు. ముంగమూరు, ఏనుగులబావి, కోళ్లదిన్నె, అల్లిమడుగు, తెల్లగుంట, ఎస్వీపాళెం, జువ్వలదిన్నెతో పాటు తీరంలోని ఎనిమిది మత్స్యకార గ్రామాల్లో రొయ్యల గుంతల సాగు గణనీయంగా పెరిగింది. ఆయా గ్రామాల్లో పచ్చటి పంట పొలాలను, పంట కాలువలను రొయ్యల గుంతలుగా మారుస్తుండడంతో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు, వరదల సమయంలో పిల్లివాగు, ఉబ్బలవాగు, ఎస్కేప్ చానల్‌తో పాటు పంట కాలువలు, ఎల్లవ కాలువలు వరద నీటిని చిప్పలేరు ద్వారా సముద్రంలోకి పంపిస్తాయి. ప్రస్తుతం కాలువలు అన్ని ఆక్రమణలకు గురవడం, వరదనీరు సాఫీగా వెళ్లే వీల్లేకుండా రొయ్యల గుంతల చుట్టూ ఎత్తుగా కట్టలు ఏర్పాటు చేస్తుండడం తీరగ్రామాల ప్రజలను కలవర పెడుతోంది.


రోడ్డుపై దుకాణదారులు ఏర్పాటు చేసిన వస్తువులు


ఆక్రమణలతో వాహనాలు పక్కకు తొలిగే పరిస్థితి లేక నెలకొన్న ట్రాఫిక్ జామ్

ట్రాఫికర్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలో నెల్లూరు పాళెం నుంచి మున్సిపల్ బస్టాండ్ వరకు మెయిన్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో సోమశిల రోడ్ సెంటర్, బీఎస్సార్ సెంటర్, పాత ప్రభుత్వ ఆస్పత్రి సెంటర్ వద్ద నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ ప్రాంతాల్లో వ్యాపారులు రోడ్డు మార్జిన్లను ఆక్రమించి వస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. వాటి ముందు కొనుగోలుదారులు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో మెయిన్‌రోడ్డులో వాహనాలు పక్కకు తొలగలేని పరిస్థితి నెలకొంటోంది. ఇటీవల మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీల్లో పూడికను తొలగించే క్రమంలో దుకాణాల ముందు నిర్మించిన శ్లాబులను తొలగించి పనులు చేపట్టారు. అప్పట్లో వ్యాపారులు రోడ్లపై వస్తువులను పెట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. అయితే కొద్ది రోజులకే వ్యాపారులు తిరిగి డ్రైనేజీలపై శ్లాబులు నిర్మించి యథాప్రకారం రోడ్ల మీదకు వచ్చేశారు. మున్సిపల్, పోలీసు అధికారులు అడ్డుకోకపోవడంతో తిరిగి ట్రాఫిక్ సమస్య అధికమైంది. బీఎస్సార్ సెంటర్ నుంచి హిల్‌రోడ్డుకు వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. మెకానిక్ షెడ్లు, వెల్డింగ్ షాపుల వారు వస్తువులను రోడ్లపైకి చేర్చి వ్యాపారాలు చేసుకుంటుండడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బోగోలులో ఉచిత వైద్య శిబిరం



చిట్రగుంట: బోగోలులోని షిర్డీ శేషసాయిబాబా మందిర కల్యాణ మండపంలో నెల్లూరుకు చెందిన శ్రీవత్స శ్వాసకోశ, చిన్నపిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆ ఆస్పత్రికి చెందిన ఊపిరితిత్తులు, శ్వాసకోశ వైద్యులు కే కళ్యాణి, చిన్నపిల్లల వైద్యులు చిరంజీవి సుమారు వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శ్వాసకోశ వ్యాధులు, లక్షణాలు, ప్రస్తుత సీజనల్‌లో విజృంభించే ఆస్తమా వ్యాధిని అదుపులో ఉంచుకోవడం, సీజనల్ మార్పులతో చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగించారు.

గృహాలకు సౌరకాంతులు

- ఇళ్లపై సౌర విద్యుత్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం
- పీఎం సూర్య ఘర్ పథకం కింద 40 శాతం సబ్సిడీ
- 25 ఏళ్ల పాటు విద్యుత్ బిల్లుల మోత నుంచి విముక్తి

➡ కావలిలోని ఓ కార్పొరేట్ సంస్థకు ప్రతి నెలా రూ.80వేల వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. ఇటీవల సదరు సంస్థ సౌర విద్యుత్‌ను సమకూర్చుకుంది. ప్రస్తుతం నెలకు కేవలం రూ.10వేలు మాత్రమే విద్యుత్ బిల్లు వస్తోంది.అంటే నెలకు దాదాపు రూ.70వేల వరకు ఆదా అయింది.

➡ కావలికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి నెలకు రూ.5,600 వరకు విద్యుత్ బిల్లు చెల్లిస్తుండేవాడు. ప్రస్తుతం తన ఇంటిపై సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంతో నెలకు రూ.1,400 మాత్రమే బిల్లు వస్తోంది. ప్రతి నెలా రూ.4,200 వరకు విద్యుత్ బిల్లు భారం తగ్గిపోయింది. సోలార్ విద్యుత్ ఏర్పాటుకు పెట్టిన పెట్టుబడిలో కొంత కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇవ్వగా, మిగిలిన పెట్టుబడి ఏడాదిన్నరలో విద్యుత్ బిల్లు ఆదా రూపంలో జమవుతోంది. ఆ తర్వాత నుంచి ప్రతి నెలా స్వల్ప బిల్లుతోనే విద్యుత్‌ను నిరాటంకంగా వినియోగించుకునే సౌలభ్యం కలిగింది.


సౌర విద్యుత్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారి


మీటర్లను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కావలి: విద్యుత్ బిల్లుల మోతను భరించలేకపోతున్నారా.. విద్యుత్ సరఫరాలో తలెత్తే అంతరాయాలతో అసౌకర్యానికి గురవుతున్నారా...అయితే సౌర విద్యుత్‌నే వీటన్నింటికీ పరిష్కారం. ఇళ్లపై సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటే నిరంతరాయంగా ఉచితంగా విద్యుత్‌ను వాడుకోవచ్చు. నానాటికి పెరిగిపోతున్న విద్యుత్ బిల్లులతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన'ను తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే వారికి సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. ఇళ్లపై 3 కిలోవాట్స్ వరకు ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే 40శాతం సబ్సిడీ ఇస్తుంది. ఆ తర్వాత నుంచి 10 కిలోవాట్స్ వరకు 20 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఇంటిపై 2 కిలోవాట్స్ సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే సుమారు రూ.1.20 లక్షలు ఖర్చవుతుంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుంది. అంటే రూ.48 వేలు సబ్సిడీపోను రూ.72 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఈ స్కీమ్ సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గృహ అవసరాలకు పోను మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్మడం ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జించవచ్చు. ఒకసారి సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకుంటనే 25 ఏళ్ల వరకు ఉచితంగా నిరాటంకంగా విద్యుత్‌ను పొందొచ్చు. పదేళ్లకు ఒక్కసారి మాత్రం బ్యాటరీని మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ ప్యానల్స్‌ను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కూడా తేలిగ్గా తీసుకెళ్లవచ్చు. ఇంటి అవసరాలకు రెండు కిలోవాట్లది సరిపోతుంది. సౌర విద్యుత్ పలకలను అమర్చుకున్న సంస్థలు, నివాసాలకు విద్యుత్ శాఖ ఒక ప్రత్యేక మీటర్‌ను అమర్చుతోంది. సౌర విద్యుత్ ఎంత ఉపయోగించుకున్నది అందులో చూపుతోంది. అలాగే విద్యుత్ శాఖ సర్వీస్‌కు సంబంధించిన మీటరు కూడా అక్కడే ఉంటుంది. సదరు వినియోగదారుడు నెలలో ఉపయోగించిన మొత్తం విద్యుత్ వివరాలను విద్యుత్ శాఖ మీటర్ చూపుతుంది. అందులో నుంచి సౌర విద్యుత్ మీటర్‌లో కనబరుస్తున్న విద్యుత్ వినియోగాన్ని మినహాయించి, మిగిలిన విద్యుత్‌కు విద్యుత్ శాఖ బిల్లు వేస్తుంది. సోలార్ విద్యుత్ పథకానికి సంబంధించిన వివరాలను సమీపంలోని విద్యుత్ సిబ్బంది లేదా 1912 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్‌చేసి సమాచారాన్ని పొందొచ్చు.కావలిలో సుమారు 20వేల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. కాగా గత ఆరు నెలల నుంచి సౌర విద్యుత్‌పై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే 25 కార్పొరేట్ సంస్థలతో పాటు 40 మంది తమ ఇళ్లపై సౌర విద్యుత్‌ను సమకూర్చుకున్నారు.

నేడు సౌర విద్యుత్‌పై అవగాహన

కావలి: పట్టణంలోని తుమ్మలపెంటరోడ్‌లో స్రవంతి సినిమాహాల్‌కు ఎదురుగా ఉన్న స్పందన ఫంక్షన్ హాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన'పై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించనున్నట్లు కావలి విద్యుత్ శాఖ ఏఈ వైవసంతరావు ఆదివారం ఒక ప్రకటనలలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే అవగాహన కార్యక్రమంలో సౌర విద్యుత్‌తో కలిగే ప్రయోజనాలను తెలియజేస్తామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సౌర విద్యుత్‌పై అవగాహన పొంది విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందాలని ఆయన కోరారు.

బోధనా మెలకువలను పెంపొందించుకోవాలి

ఆత్మకూరు: ప్రైవేట్ పాఠశాలల్లోని ఎల్‌కేజీ, యూకేజీ, ప్లేక్లాస్ టీచర్లు బోధనా మెలకువలను పెంపొందించుకోవాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఎల్‌కేజీ, యూకేజీ, ప్రైమరీ క్లాస్ టీచర్లకు ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నారులకు సులభతరంగా బోధన చేసేందుకు అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్యా బోధన చేయాలని సూచించారు. విద్యార్థుల్లో చిన్న తరగతుల్లోనే విద్యపై ఆసక్తిని పెంపొందిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కృష్ణజ్యోతి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని అపస్మా కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కోటేశ్వరరెడ్డి, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి

వరి పంట ఎండు ముఖం


కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్


నీరు లేక ఎండిపోయిన వరి పొలం

- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- పదిహేనురోజులుగా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- ఆందోళనలో రైతులు

ఉదయగిరి: వేల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. ఆరుగాలం కష్టించి వరి పంట సాగు చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పదిహేను రోజులుగా సాగునీరు అందక కళ్లెదుటే పంట ఎండుముఖం పడుతుండడంతో రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ పరిస్థితి మండలంలోని గండిపాళెం గ్రామంలో నెలకొంది. వివరాలు..గండిపాళెం పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ పదిహేనురోజుల క్రితం ఉరుములు, మెరుపులతో వర్షం పడిన సమయంలో కాలిపోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో బోర్ల కింద సుమారు 15 ఎకరాల్లో వరి పైరు సాగుచేసి ఉన్నారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశలో ఉంది. ఈ దశలో పంటకు పుష్కలంగా సాగునీరు అవసరం. ఈ పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి సాగునీరు అందక పంట ఎండుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు విద్యుత్ సిబ్బందికి మొరపెట్టుకోగా ఐదు రోజుల క్రితం చైన్‌బ్లాక్ సాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దించారు. ఇప్పటి వరకు దాన్ని తీసుకెళ్ల లేదు. కొత్తది కూడా ఏర్పాటు చేయలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి వరి పంటను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆంజనేయా.. ఏమిటీ దుస్థితి

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో దశాబ్దాల క్రితం ఆంజనేయస్వామి మందిరాన్ని నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్నుంచి విశేష పూజలు అందుకుంటున్న ఆంజనేయునికి నేడు నిలువు నీడా కరువవడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారు. 2016 ఆగస్టు 18న 565వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దుత్తలూరు సెంటర్‌లోని ఆంజనేయస్వామి మందిరాన్ని తొలగించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని రోడ్డు పక్కన వదిలేశారు. అప్పట్లో 'సాక్షి'లో 'ఆంజనేయుడికి నీడేది' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో నిర్వాహకులు తాత్కాలిక ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి యథాతథంగా పూజలు కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల దుత్తలూరు సెంటర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా తాత్కాలిక గుడిని తొలగించి విగ్రహాన్ని చెరువుకట్టపై ఉంచారు. కనీసం నీడ కూడా కల్పించలేదు. ఆ మార్గంలో వాహనాల్లో వెళ్లే భక్తులు అభయమిచ్చే ఆంజనేయస్వామిని గమనించి ఏమిటీ దుస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడి నిర్మించే వరకు ఏదైనా మంచిప్రదేశంలో ఉంచి నీడ కల్పించకుండా మల, మూత్ర విసర్జనలు చేసే చెరువు కట్ట వద్ద ఉంచడం ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆలయ నిర్వాహకులు స్పందించి వెంటనే ఆంజనేయస్వామికి నీడ కల్పించాలని, త్వరితగతిన ఆలయ నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.


చెరువు కట్టపై ఆంజనేయుని విగ్రహం

మేకపాటి పరామర్శ

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాదెండ్ల పెద్దరంగయ్య ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. పెద్దరంగయ్య మృతి పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, నాయకులు బొడ్డు వెంకటేశ్వరరెడ్డి, దాసరి ఎర్రఓబయ్య, మాగంటి శ్రీనివాసులు, మురళీకృష్ణారెడ్డి, బీ రత్నం, సర్పంచ్‌లు పీ పెద్దమాలాలి, కే ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


నాదెండ్ల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మేకపాటి

ఎట్టకేలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

జలదంకి: మండలంలోని అన్నవరం ఎస్సీ కాలనీలో నెల రోజుల క్రితం మంచినీటి పథకం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్య నెలకొంది. దాని స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించలేదు. ఈ విషయమై 'సాక్షి'లో 'అన్నవరం ఎస్సీకాలనీలో తాగునీటికి కటకట' శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనికితోడు స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం ఉదయం నిరసన తెలిపారు. దీంతో ఎట్టకేలకు స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


ఆదివారం ఉదయం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువు నుంచి గువ్వాడి మీదుగా వరికుంటపాడు, పామూరుకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరేందుకు సమయానుకూలంగా బస్సు సర్వీసును నడపాలని కోరుతున్నారు. ఈ మార్గంలో ఉదయగిరి ఆర్టీసీ డిపో అధికారులు ఉదయం పూట విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు బస్సు నడుపుతున్నారు. సాయంత్రం తిరిగి ఇళ్లకు వచ్చేందుకు బస్సు సౌకర్యం లేక బాల, బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బస్సు సర్వీసు ఉండగా అధికారులు అర్ధంతరంగా రద్దు చేసి వేరే మార్గంలో నడుపుతున్నారు. దీంతో సాయంత్రం ఇళ్లకు చేరేందుకు విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. బస్‌పాస్‌లు ఉన్నా అధిక చార్జీలు చెల్లించి ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ఇళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉదయగిరి డిపో అధికారులు స్పందించి సాయంత్రం వేళ విద్యార్థులకు అనుగుణంగా పామూరు నుంచి గువ్వాడి మీదుగా ఉన్న సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

అనుమసముద్రంపేట: మండలంలోని తిమ్మానాయుడుపల్లిలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోలేరమ్మ ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రధాన అర్చకులు బ్రహ్మయ్యస్వామి ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వినాయకుడితో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణ దాత నాగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తిరుపతిరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు తిరుమలనాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఆధార్ అప్‌డేట్‌కు విద్యార్థుల పాట్లు

దుత్తలూరు: మండలంలో 11 సచివాలయాలు ఉన్నా ఆధార్ అప్‌డేట్ కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి అపార్ నమోదు చేపడుతోంది. అందుకు సంబంధించి విద్యార్థుల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుల్లోని వివరాలకు ఎలాంటి తేడాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. దుత్తలూరు, నందిపాడు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినా పరికరాలు పనిచేయక సేవలందడం లేదు. దీంతో విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కోసం సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలాధికారులు వెంటనే స్పందించి ఆధార్ అప్‌డేట్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.